భారీగా పెరిగిన కొత్త ఓటర్లు

- ఈ ఎన్నికల్లో యువతే కీలకం
- ఈ నెల 10న అనుబంధ జాబితా విడుదల
- ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుల విచారణ

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉంటుందని, వారే భావిభారత సౌభాగ్యానికి కీలకమని పదేపదే వింటూనే ఉంటాం. కేవలం దేశంలోనే కాదు సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాల్లో కూడా యువత జనాభా, యువ ఓటర్ల సంఖ్య అధికంగానే ఉంది.


సత్తుపల్లిలో కొత్త ఓటర్ల దరఖాస్తులను విచారణ చేస్తున్న అధికారులు

సత్తుపల్లిటౌన్: నవంబర్ 30 జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం కొత్త ఓట్ల నమోదుకు అక్టోబర్ 30వ తేదీ వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించటంతో దరఖాస్తులు వెల్లువలా వచ్చాయి. సత్తుపల్లి, మధిర, వైరా నియోజకవర్గాలలో కొత్త ఓటర్లు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నారు. ఈ ఏడాది అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల సంఘం ఇచ్చిన అవకాశంతో ఓటు కోసం దరఖాస్తులు వెల్లువెత్తాయి.

మూడు నియోజకవర్గాల్లోని ఓటర్లు..
సెప్టెంబర్ 20 నుంచి అక్టోబర్ 30 నాటికి సత్తుపల్లి నియోజకవర్గంలో 5,878, అలాగే మధిర నియోజకవర్గంలో 4,084, వైరాలో 7,647 దరఖాస్తులు వచ్చాయి. సత్తుపల్లి నియోజకవర్గంలో 2,38,621 మంది, మధిర నియోజకవర్గంలో 2,18,585 మంది, వైరా నియోజకవర్గంలో 1,90,755 మంది ఓటర్లు ఉన్నారు.

పెరిగిన దరఖాస్తులు..
కొత్త దరఖాస్తులతో నియోజకవర్గాలలో ఓటర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. గత నెల 4వ తేదీన ఓటర్ల తుది జాబితాను అధికారులు ప్రకటించారు. కొత్త ఓటర్లకు మరో అవకాశం ఇవ్వటంతో మరో అనుబంధ జాబితాను సిద్ధం చేసే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది.

కొత్త ఓటర్ల దరఖాస్తులపై విచారణ..
అనుబంధ కొత్త ఓటర్ల జాబితాను ఈ నెల 10వ తేదీ నాటికి సిద్ధం చేయనున్నారు. ఇందుకోసం సెక్టోరియల్ అధికారుల పర్యవేక్షణలో బూత్‌లెవల్ అధికారులు కొత్త ఓటర్ల దరఖాస్తులను చిరునామాల ఆధారంగా ఇంటింటికీ వెళ్లి విచారణ చేపడుతున్నారు. ఇతర ప్రాంతాలలో ఏమైనా ఉందో లేదో వెబ్‌సైట్‌లో పరిశీలించి కొత్త ఓటర్లను ఎంపిక చేస్తున్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులకు ఎన్నికల అధికారులు అనుబంధ ఓటర్ల జాబితా అందించేందుకు చర్యలు చేపట్టారు. ఈ దఫా ఓటరుగా దరఖాస్తు చేసుకున్న వారిలో ఎక్కువ మంది ఆన్‌లైన్‌లోనే నమోదు చేసుకున్నారు. ఈ విడతలో యువత ప్రాబల్యం ఎక్కువగా కనిపించింది. కొత్తగా ఓటు హక్కు పొందిన వారు ఈ నెల 30న జరిగే పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం లభిస్తుంది.

ఓటు ఎంతో విలువైంది..



ప్రజాస్వామ్యంలో ఎంతో విలువైన ఓటును ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి. ఓటుపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. కొత్తగా వచ్చిన దరఖాస్తుల విచారణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. 10వ తేదీకల్లా అనుబంధ జాబితాను సిద్ధం చేస్తాం.
– అశోక్ చక్రవర్తి, రిటర్నింగ్ అధికారి, సత్తుపల్లి

ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయండి



సెల్ఫీ పాయింట్ వద్ద విద్యార్థులతో కలెక్టర్ గౌతమ్

సత్తుపల్లిటౌన్: స్వేచ్ఛగా, నిర్భయంగా.. ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా ఓటు వేయాలని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ సూచించారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఓటు హక్కుపై ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల వేళ అక్రమాలకు పాల్పడేవారి విషయమై సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయెుచ్చని తెలిపారు. సమాచారం కోసం ఓటరు హెల్ప్‌లైన్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే, అర్హులందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా విద్యార్థులు అవగాహన కల్పించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం సెల్ఫీ పాయింట్ వద్ద ఆయన విద్యార్థులతో కలిపి ఫొటో దిగారు. స్వీప్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండపల్లి శ్రీరాం, అసిస్టెంట్ కలెక్టర్ మయాంక్‌సింగ్, రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తి, జేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతుకు అండగా నిలిచిన ఏకైక సీఎం కేసీఆర్


మాట్లాడుతున్న ఎంపీ నాగేశ్వరరావు, పక్కన మదన్‌లాల్

కొణిజర్ల: రైతులకు అండగా నిలవాలని ఆలోచన చేసిన దేశంలోనే ఏకైక సీఎం కేసీఆర్ అని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. వైరా బీఆర్ఎస్ అభ్యర్థి బాణోత్ మదన్‌లాల్ కొణిజర్ల మండలంలో సోమవారం ప్రచారాన్ని ప్రారంభించగా ముఖ్య అతిథిగా ఎంపీ మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక రైతుబంధు, రైతు పథకాలు ప్రవేశపెట్టడమే కాక ప్రాజెక్టుల నిర్మాణంతో రైతుల కష్టాలు తీరాయని తెలిపారు. కాగా, ఆరు గ్యారంటీల పేరుతో వస్తున్న కాంగ్రెస్ నేతలు అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారో నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కాగా, మదన్‌లాల్ రాజ్యాతండా నుంచి అమ్మపాలెం మీదుగా తనికెళ్ల, తుమ్మలపల్లి, అన్నవరం, రామనర్సయ్యనగర్‌లో ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కార్యకర్తలు అమ్మపాలెంలో ఆయనను గజమాలతో సత్కరించగా, జెడ్పీటీసీ సభ్యురాలు పోట్ల కవిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వై.చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశుద్ధ్యం మెరుగుపడాలి


కమలాపురంలో వివరాలు ఆరా తీస్తున్న అధికారులు

ముదిగొండ: ప్రతి గ్రామంలో పారిశుద్ధ్యం నిర్వహించాలని డీపీఓ హరికిషన్ అన్నారు. మండలంలోని కమలాపురం, వల్లాపురంలలో సోమవారం పర్యటించారు. ఇటీవల గ్రామాల్లో డెంగీ కేసులు నమోదు కావడంతో ఆ ఇళ్లను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో, ఇళ్లలో ప్రత్యేక పారిశుద్ధ్యం చేయాలని సిబ్బందికి సూచించారు. పారిశుద్ధ్యం వివరాలను సేకరించారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ పుల్లారావు, ఎంపీఓ సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు రజని, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వయోజన విద్యా కేంద్రాలు ప్రారంభం


కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాజాచంద్ర

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామంలో సోమవారం వయోజన విద్యా కేంద్రాలను స్ఫూర్తి సేవా సదన హైదరాబాద్, సహార మినిస్ట్రీ ఖమ్మం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ రాజాచంద్ర, ఎం.రాజు, కేఎల్‌బీ శాస్త్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో పలకలు, పుస్తకాలు, ఆరోగ్యానికి సంబంధించిన సూచిక పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఆదూరి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మరిచిన పాలకులను ఓడిద్దాం


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రసాద్

వైరా: ఈ నెల 30న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలను మరిచిన పాలకులను ఓడించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ పిలుపునిచ్చారు. వైరాలో సోమవారం నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానిక రాజకీయ పరిస్థితుల దృష్ట్యా కాంగ్రెస్‌తో ఒప్పందం చేసుకుని ఈ ఎన్నికలలో బరిలో దిగుతుందన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ నిర్ణయాన్ని శిరసా వహిస్తూ వైరా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా గెలిపించడానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో వైరా నియోజకవర్గ కార్యదర్శి యర్రాబాబు, లతాదేవి, రావిశివరామకృష్ణ, రంజిత్, నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.

జేవీఆర్ కళాశాలలో 'తొలిమెట్టు'


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్

సత్తుపల్లిటౌన్: స్థానిక జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పిల్లల కోసం తొలిమెట్టు అనే అంశంపై సోమవారం శిక్షణా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కె.విజయ్ కుమార్ మాట్లాడుతూ.. కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉంటూ సమీప ప్రాంతంలోని పాఠశాలలను ఎంచుకొని విద్యాబోధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి బంగారి, అధ్యాపకులు పానెం రామచంద్రరావు, ఎం.రాంబాబు, ఎం.మాధవి, శ్రీనివాసరావు, శ్రీధర్, ప్రభావతి, రాజ్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

ఎర్రుపాలెం/తల్లాడ: మండలకేంద్రాల్లో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్‌తో పాటుగా.. సత్తుపల్లి అభ్యర్థి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను గెలిపించాలని బీఆర్ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. అనంతరం మధిరలో ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జీవీఆర్, డి.నరేష్‌రాజు, బోడ్డు వెంకటేశ్వరరావు, గుండ్ల వెంకటి, టి.రఘు, మహేష్, గంజాయి శివ, సత్యం, శ్రీను, మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ చావా రామకృష్ణ, మండల కమిటీ అధ్యక్షుడు సాంబశివరావు, ఎంపీపీ శిరీష, సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ మస్తాన్ వలీ తదితరులు పాల్గొన్నారు.

మూడోరోజు నామినేషన్ల దాఖలు

వైరా నియోజకవర్గంలో రెండు..


నామినేషన్ వేస్తున్న ఏన్కూరు విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి గుగులోత్ బసవయ్య

వైరా: వైరా అసెంబ్లీ నియోజకవర్గానికి సోమవారం రెండు సెట్ల నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఏన్కూరు మండల విద్యార్థుల రాజకీయ పార్టీ పేరుతో ఇండిపెండెంట్ అభ్యర్థి గుగులోత్ బసవయ్య నామినేషన్ దాఖలు చేశారు. పెనుబల్లి మండలం అలయన్స్ ఆఫ్ పీపుల్ డెమోక్రటిక్ రీఫామ్స్ పార్టీ తరుపున మాలోత్ శ్యామ్ లాల్ నాయక్ (గంగదేవిపాడు) నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి బి.సత్యప్రసాద్‌కు అందజేశారు.


నామినేషన్ వేస్తున్న పీడీఆర్‌పీ అభ్యర్థి శ్యాంలాల్ నాయక్

సత్తుపల్లిలో ఒకటి..



నామినేషన్ దాఖలు చేస్తున్న చిప్పలపల్లి వీరయ్య

సత్తుపల్లి: సత్తుపల్లి అసెంబ్లీ ఎన్నికలకు సోమవారం ఒకటే నామినేషన్ దాఖలైంది. యూసీసీఆర్ఐ(ఎంఎల్) పార్టీకి చెందిన చిప్పలపల్లి వీరయ్య రెండు సెట్ల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి అశోక్‌చక్రవర్తికి అందించారు. ఈయన కామేపల్లి మండలం అడవిమద్దులపల్లి గ్రామానికి చెందిన వీరయ్య 9వ తరగతి వరకు చదివినట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

మధిరలో ఒకటి..


నామినేషన్ వేస్తున్న బుద్దయ్య

మధిర: మధిర నియోజకవర్గానికి జరగబోయే ఎన్నికలకు సంబంధించి సోమవారం ఒక నామినేషన్ దాఖలైంది. అలియన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ అభ్యర్థిగా ఆంబోజు బుద్దయ్య మధిర తహసీల్‌లో రిటర్నింగ్ అధికారి గణేష్‌కు నామినేషన్ పత్రాన్ని అందజేశారు.

కాంగ్రెస్ అభ్యర్థుల బయోడేటా



- నియోజకవర్గం : వైరా
- పేరు: మాలోత్ రాందాస్ నాయక్
- స్వగ్రామం: ఎదురుగడ్డ, లక్ష్మీదేవిపల్లి మండలం, భద్రాద్రి కొత్తగూడెం
- తల్లిదండ్రులు : లక్ష్మి, హనుమా
- విద్యాభ్యాసం: బీకాం
- భార్య : లలిత, ఏఎన్ఎం
- కుమార్తెలు : డాక్టర్ గాయత్రి, డాక్టర్ చందన, కుమారుడు విఘ్నేష్
- ప్రస్తుత నివాసం : వైరా
- రాజకీయ అనుభవం : ఎన్ఎస్‌యూఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శిగా, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. కొత్తగూడెం సొసైటీ డైరెక్టర్‌గా పనిచేశారు. 2007 నుండి 2009 వరకు కొత్తగూడెం టీడీపీ మండల అధ్యక్షుడిగా, టీడీపీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. టీడీపీ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్ పనిచేశాక కాంగ్రెస్‌లో చేరి 2018 నుంచి పీసీసీ సభ్యుడిగా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.



- నియోజకవర్గం : సత్తుపల్లి
- పేరు : డాక్టర్ మట్టా రాగమయి
- భర్త : డాక్టర్ మట్టా దయానంద్
- పిల్లలు : నీలోత్పల, విపంచి, విరాజి
- విద్యాభ్యాసం: ఎంబీబీఎస్, డీటీసీడీ(ఛాతివైద్యురాలు)
- వయస్సు : 52 సంవత్సరాలు
- సేవా కార్యక్రమాలు : తన కూతురు అకాల మరణంతో ఆషా పేరిట స్వచ్ఛంద సేవా సంస్థ స్థాపించి రక్తదాన, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.
- రాజకీయ నేపథ్యం : భర్త డాక్టర్ మట్టా దయానంద్ భార్యగా పరిచయం. ఆమె అత్త డాక్టర్ మట్టా ఆరోగ్యం ఎంపీపీగా పనిచేశారు. మామ మట్టా కృష్ణమూర్తి స్వాతంత్ర్య సమరయోధుడు. 2014 ఎన్నికల్లో పోటీ చేసేందుకు సత్తుపల్లి ప్రభుత్వాస్పత్రిలో ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఆ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన ఆమె భర్త దయానంద్ రెండువేల ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. ఈసారి కూడా దయానంద్ పోటీకి దిగాలని భావించినా కులధ్రువీకరణపై వివాదం తలెత్తడం, కోర్టులో కేసు పెండింగ్ ఉండటంతో మట్టా రాగమయి రాజకీయంగా తెరపైకి వచ్చారు.

కేంద్ర బలగాల కవాతు


ఏన్కూరులో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ఏన్కూరు/చింతకాని: శాంతియుతంగా ఎన్నికల పోలింగ్ జరిగేందుకే గ్రామాల్లో పోలీసుల కవాతు నిర్వహిస్తున్నామని వైరా, మధిర సీఐలు సాగర్, వసంత్‌కుమార్‌లు తెలిపారు.

సోమవారం ఏన్కూరులో మండలంలోని పోలీస్‌స్టేషన్ నుంచి ఏన్కూరు ప్రధాన సెంటర్, టీయల్‌పేట రోడ్డులో సినిమాహాలు వరకు ర్యాలీ నిర్వహించగా.. చింతకాని మండలంలోని ప్రొద్దుటూరు, పాతర్లపాడు గ్రామాల్లో పోలీసుల కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమాలల్లో ఏన్కూరు, జూలూరుపాడు, చింతకాని, బోనకల్ ఎస్సైలు బాదావత్ రవి, పురుషోత్తమ్, రాజేందర్, సాయి, సీఆర్‌పీఎఫ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

ముదిగొండ: మండలంలోని మల్లారంలో పాల ఉత్పత్తిదారుల అసోసియేషన్‌లో పాలు పోస్తున్న కోటేశ్వరరావు ఇటీవల మరణించారు. కృష్ణా మిల్క్ యూనియన్ పాలకవర్గ ప్రతినిధులు చెరుకూరి లవయ్య, చావా పాపారావు, మేనేజర్ సంపత్‌కుమార్‌లు రూ.50వేల చెక్కును కోటేశ్వరరావు భార్య పద్మకు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల వేతన కార్యదర్శి రమేష్, సూపర్‌వైజర్ రాంబాబులు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపక పోస్టుల భర్తీకి 8న ఇంటర్వ్యూలు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 8న ఎకనామిక్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పీజీ, ఎన్ఈటీ, ఎస్ఈటీ, పీహెచ్‌డీ అర్హతలు ఉన్నవారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావొచ్చని ఆమె తెలిపారు.

9న జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..
సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్ తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న బోటని పోస్టుకు తాత్కాలిక ప్రాతిపదిక గెస్ట్ లెక్చరర్‌ను నియామకం చేసేందుకు ఈ నెల 9వ తేదీన ఉదయం 10 గంటలకు అభ్యర్థులు ఇంటర్వ్యూలు హాజరు కావాలని కోరారు. 8వ తేదీ సాయంత్రం 4 గంటల్లోపు పూర్తి బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లతో కళాశాలకు హాజరు కావాలని తెలిపారు.

ధర్మ మృతికి పొంగులేటి సంతాపం


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీనివాసరెడ్డి

వైరా/కొణిజర్ల: వైరా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు బానోత్ విజయాబాయి తండ్రి, సీపీఎం సీనియర్ నాయకుడు గుగులోత్ ధర్మ సోమవారం మృతి చెందారు. ఆయన మృతదేహం వద్ద స్వగ్రామమైన సుజాతనగర్ మండలం మంగపేటకు వెళ్లిన కాంగ్రెస్ ప్రచార కమిటీ కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, కొణిజర్ల సర్పంచ్ సూరంపల్లి రామారావుతో పాటు నాయకులు బొర్రా రాజశేఖర్, మాలోత్ రాందాస్ నాయక్, శీలం వెంకటనర్సిరెడ్డి, రాంపూడి రోశయ్య, పరికపల్లి శ్రీనివాసరావు తదితరులు కూడా నివాళులర్పించారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


సత్తుపల్లి ద్వారకాపురి కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న రాగమయి

సత్తుపల్లిరూరల్: తెలంగాణ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ మట్టా రాగమయి కోరారు. పట్టణంలోని ద్వారకాపురి కాలనీలో గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన గ్యారంటీ పథకాలను వివరిస్తూ.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్‌తో ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఈ కార్యక్రమంలో వెంట మానుకోట ప్రసాద్, ఆనంద్, జీవన్, శ్రీను, మణి, చెన్నారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా.. ఆదరించండి


కల్లూరు మెయిన్ సెంటర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

కల్లూరు/కల్లూరురూరల్: అభివృద్ధి చేసిన తనను మరోసారి ఆశీర్వదించాలని సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా కల్లూరులోని ప్రధాన సెంటర్, ఓబులరావు బంజర్, ముచ్చవరం, యజ్ఞనారాయణపురం పంచాయతీలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్, రైతుబంధు, రైతుబీమా తదితర ఎన్నో పథకాలు పేద ప్రజలకు, రైతులకు అందాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్ళీ అధికారంలోకి వచ్చిన వెంటనే భూమిలేని నిరుపేదలకు కేసీఆర్ బీమా సౌకర్యం కల్పిస్తామని, ప్రతీ గృహిణి ఖాతాలో నెలకు రూ.3 వేలు జమ చేస్తామని, గ్యాస్ సిలెండర్ రూ.400కే మహిళలకు అందిస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పాలెపు రామారావు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, ఎంపీపీ రఘు, రైతు సమితి మండల కన్వీనర్ లక్కినేని రఘు, సర్పంచ్‌లు సూర్య నారాయణ, మాన్‌సింగ్, వెంకటేశ్వరరావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నిత్యం అందుబాటులో ఉంటా..


సమావేశంలో మాట్లాడుతున్న కమల్‌రాజ్

మధిర: మధిర నియోజకవర్గ ప్రజలు ఒక్కసారి అవకాశం ఇచ్చి నన్ను గెలిపిస్తే నిత్యం మీకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ అభ్యర్థి, జెడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్ అన్నారు. సోమవారం ఆయన జాలిముడి, మల్లవరం, రొంపిమళ్ల, వెంకటాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ.. జెడ్పీ చైర్మన్‌గా ప్రజల అనేక సమస్యలను పరిష్కరించానని, అధికార పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యేగా ఉంటే మరింత అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. భట్టి చుట్టపు చూపుగా వస్తున్నాడని, ఆయన ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఆయనకు కనిపించడం లేదన్నారు. కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలే తన గెలుపుకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తుందన్నారు. ఈ నెల 9న నామినేషన్ వేస్తానని చెప్పారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం, మధిర నుంచి లింగాల కమల్ రాజు గెలుపొందడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు బిక్కి కృష్ణ ప్రసాద్, చిత్తారు నాగేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, బొగ్గుల భాస్కర్ రెడ్డి, గుర్రం రామారావు, చావా వేణు, కూనా నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన భీమవరం పాఠశాల బాలికలు

ఎర్రుపాలెం/బోనకల్: మండలంలోని భీమవరం గ్రామం వేమిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సీహెచ్.దుర్గాభవాని, ఎస్.తేజశ్రీ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 5వ తేదీన కల్లూరులో జరిగిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబర్చగా రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారని హెచ్ఎం బి.సుభద్రాదేవి తెలిపారు. విద్యార్థులను సోమవారం సర్పంచ్ శీలం జయలక్ష్మి, జెడ్పీటీసీ శీలం కవిత, ఎంపీటీసీ సంక్రాంతి కృష్ణారావు, పీఈటీ గూడూరు వెంకటసత్యనారాయణరెడ్డి,, ఎస్ఎంసీ చైర్మన్ కృష్ణారెడ్డి, శేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే, బోనకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి గంగుల లలితశ్రీ కూడా రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైందని హెచ్ఎం గోపీచంద్, పీఈటీ శ్రీనివాస్ తెలిపారు.


బోనకల్ విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తెలంగాణాలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే


కల్లూరులో బజ్జీలు వేస్తున్న నంబూరి రామలింగేశ్వరరావు, నాయకులు

కల్లూరు: తెలంగాణాలో రాబోయేది భారతీయ జనతా పార్టీనేనని బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో కల్లూరులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశాన్ని అగ్రగామిగా నిలుపుతున్న ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలన తెలంగాణాలో కూడా సమగ్రంగా అమలు జరగాలన్నారు. ప్రతి ఒక్కరూ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి బీజేపీని గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా కిరాణా షాపులు, కూరగాయల షాపులు, హోటళ్లు తదితర వ్యాపార వర్గాలను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ ఎన్నికల ప్రచారంలో ఖమ్మం జిల్లా ఇన్‌చార్జ్ మధుకర్ జి, నియోజకవర్గ కన్వీనర్ భాస్కర్ల వీరంరాజు, జిల్లా కార్యదర్శి నాయుడు రాఘవరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మట్టా ప్రసాద్, మండల అధ్యక్షుడు గుమ్మా రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి పుల్లారావు, మరీదు కృష్ణ, భీమరాజ్, మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.